క్లుప్తంగా

అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు



మొల్లేటిమొగలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్‌ఐ నాగేశ్వరరావు

కాట్రేనికోన: మండలంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కాట్రేనికోన ఎస్‌ఐ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పల్లంకుర్రు పంచాయతీ మొల్లేటిమొగలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న బెల్టుషాపుపై దాడి చేసి 123 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం అమ్మకాలు చేస్తున్న ఓలేటి గంగాద్రిని అదుపులోకి తీసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

ఐ.పోలవరం: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని మండల విద్యాశాఖాధికారులు ఎస్.కొండారెడ్డి, కె.తిరుమలరావులు తెలిపారు. చివరి రోజైన బుధవారం జరిగిన సోషల్ పరీక్షను మండలంలోని నాలుగు సెంటర్లలో కలిపి 710 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా, 704 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. మరో ఆరుగురు గైర్హాజరయ్యారన్నారు. పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన అధికారులందరికీ వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు తాడికోన నుంచి ఎన్నికల ప్రచారం

అల్లవరం: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా మంత్రి పినిపే విశ్వరూప్ గురువారం ఉదయం 8 గంటలకు మండలంలోని తాడికోన గ్రామం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ తెలిపారు. తాడికోన, గూడాల, కోడూరుపాడు గ్రామాల్లో నిర్వహించనున్న ఎన్నికల ప్రచారానికి పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

ఘనంగా కార్పెంటర్ల ఆవిర్భావ దినోత్సవం

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా దుర్గా మల్లేశ్వరస్వామి కార్పెంటర్ చేతి వృత్తుల సంక్షేమ సంఘం కార్యాలయంలో కార్పెంటర్ల ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సంఘ కార్యాలయ ఆవరణలో సంఘం జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి ఆవిర్భావ వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి దంగేటి రామకృష్ణ, గున్నేపల్లి భీమశంకరం, పితాని బేబీరావు, కొనుకు వెంకటేశ్వరరావు, ఎలిపే శ్రీనివాస్, రొక్కాల వెంకటేశ్వరరావు, కుసుమే నర్సింహరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు పుదుచ్చేరి చీఫ్ సెక్రటరీ చౌహాన్ రాక



పుదుచ్చేరి ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శరత్ చౌహాన్

యానాం: వచ్చే నెల 19న జరగనున్న పుదుచ్చేరి లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో యానాంలో పోలింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్‌చౌహాన్ గురువారం యానాం రానున్నారు. ఈ మేరకు యానాం ఆర్‌ఏఓ ఆఫీసుకు సమాచారం అందింది. గురువారం మధ్యాహ్నం యానాం రానున్న ఆయన 29, 30 తేదీల్లో లోక్‌సభ ఎన్నికకు సంబంధించి ఏర్పాట్లపై యానాం ఆర్‌ఏఓ ఆఫీసులో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తారన్నారు. 31న విశాఖకు చేరుకుని, ఏప్రిల్ 1న పుదుచ్చేరి వెళతారన్నారు.

జగన్ పాటకు నాయకుల డ్యాన్స్



డ్యాన్స్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అమలాపురం టౌన్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పినిపే విశ్వరూప్ ఎన్నికల ప్రచార ప్రారంభ కార్యక్రమంలో భాగంగా జరిగిన ర్యాలీలో అమలాపురంలో కొందరు పార్టీ నాయకులు ముఖ్యమంత్రి జగన్ పాటకు డ్యాన్స్ చేసి పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచారు. 'జెండాలు జత కట్టడమే మీ అజెండా... జనం గుండెల్లో గుడి కట్టడమే జగన్ అజెండా' అనే పాటకు మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, మున్సిపల్ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ తదితరులు డ్యాన్స్ చేసి ఆకట్టుకున్నారు.

అడుగడుగునా జన నీరాజనం

- అమలాపురం అసెంబ్లీలో మొదలైన వైఎస్సార్ సీపీ ప్రచారం
- అసెంబ్లీ అభ్యర్థి విశ్వరూప్, ఎంపీ అభ్యర్థి రాపాకలకు ప్రజల బ్రహ్మరథం



ఎస్.కొత్తపల్లిలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు హారతులిస్తున్న మహిళలు



ఎస్.కొత్తపల్లిలో కరపత్రాలను ప్రజలకు అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

ఉప్పలగుప్తం: అడుగడుగునా జన నీరాజనం.. ప్రతిచోట పోటెత్తిన జనం.. అమలాపురం అసెంబ్లీ పరిధిలో వైఎస్సార్ సీపీ చేపట్టిన తొలి ఎన్నికల ప్రచారం జోరుగా, హుషారుగా సాగింది. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన వందల మంది కార్యకర్తలు, నాయకుల సమక్షంలో పార్టీ అసెంబ్లీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం పార్లమెంట్ అభ్యర్థి, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్‌లు ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఎన్నికల్లో నిర్వహించినట్టుగానే ఈసారి కూడా ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి శివారు నల్లవారిపేటలో బుధవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. వీరితో పాటు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబులు కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

మంత్రి విశ్వరూప్‌కు అభిమానులు అడగడుగునా నీరాజనాలు పట్టారు. పలుచోట్ల మహిళలు హారతి పట్టారు. విశ్వరూప్, రాపాకలను హత్తుకుని వృద్ధులు తమ అభిమానాన్ని చాటుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో అభ్యర్థులు పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్ళిన అభ్యర్థులకు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. ముందుగా వారిద్దరూ రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వరూప్, రాపాకలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్న ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంచే చిట్టికుమారి, వైస్ ఎంపీపీలు నడింపల్లి విజయలక్ష్మి, సాదే శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండల చైర్మన్ మానే శ్రీను, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, సొసైటీ అధ్యక్షుడు నడింపల్లి వాసురాజు, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు బుజ్జి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వంగా గిరిజాకుమారి, గ్రామ కమిటీ అధ్యక్షుడు లంకే సూరిబాబు, కుంచే చిన్ని, కొంకి బాలకృష్ణ, వెంకట బాబ్జి, భగవాన్‌దాస్, అంగాని రాంబాబు, కోలా కృష్ణ, లక్ష్మణ్, సర్పంచ్, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షులు కడిమి చిన్నవరాజు, పెట్టా అప్పారావు, మోటూరి సత్యంకాపు, జోగిరాజా, సలాది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో శాంతి భద్రతలకు సహకరించాలి



ఎన్నికల బందోబస్తు గురించి అవగాహన కల్పిస్తున్న పట్టణ సీఐ క్రిస్టోఫర్

అమలాపురం టౌన్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పట్టణంలో శాంతి భద్రతలకు ప్రజలు పోలీసులకు సహకరించాలని పట్టణ సీఐ క్రిస్టోఫర్ విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో అమలాపురం మద్దాలవారిపేట, శ్రీరామపురం, వెత్సావారి అగ్రహారం, గండు వీధి, నల్లా వీధి తదితర వీధుల్లో బుధవారం సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో సీఐ క్రిస్టోఫర్ ఎన్నికల బందోబస్తు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ చంటి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాల్లో ఓటింగ్ శాతం పెరగాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

అమలాపురం టౌన్: పట్టణాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటుందని, రానున్న ఎన్నికల్లో పట్టణాల్లోనూ ఓటింగ్ పెరిగేలా ఓటర్లు చైతన్యవంతులు కావాలని జిల్లా ఎన్నికల నోడల్ అధికారి ఎ.మధుసూదనరావు అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఓటర్ల చైతన్య ర్యాలీని మధుసూదనరావు జెండా ఊపి ప్రారంభించారు. ఓటర్లు ఓటు హక్కు వినియోగం ద్వారా దేశానికి బలమైన ప్రజాస్వామ్యాన్ని అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఓటర్ల చైతన్య ర్యాలీలో పాల్గొని ఓటు హక్కు మన ఆయుధం అంటూ నినాదాలు చేశారు. అవగాహన ర్యాలీ హైస్కూలు సెంటరు, గడియారం స్తంభం సెంటర్లలో సాగింది. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు డి.రమేష్‌బాబు, డాక్టర్ ఎంఏకే భీమారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు, వాకర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రాధాన్యంపై ర్యాలీ

యానాం: ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేస్తూ బుధవారం స్థానిక ఎస్‌ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ 1, 2 వలంటీర్లు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్ఏఓ ఆఫీసు వద్ద రిటర్నింగ్ అధికారి మునిస్వామి పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ ఆఫీసర్ బి.విజయసాగర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాటి పాలకుల పాపం.. రైతులకు శాపం

చొల్లంగిలో అన్నదాతల ఆవేదన



చొల్లంగి పంట కాలువను తొమ్మిది అడుగుల నుంచి నాలుగు అడుగులకు కుదించేశారని చూపిస్తున్న రైతులు



సాగునీటి సమస్యకు కారణమైన చొల్లంగిలోని కాంక్రీటు నిర్మాణం

తాళ్లరేవు: టీడీపీ ప్రభుత్వ హయాంలో నిక్షేపంలా ఉన్న పంట కాలువను పూడ్చి వేసి కాంక్రీటు నిర్మాణం చేపట్టి తమకు సాగునీటి కష్టాలు తెచ్చి పెట్టారని చొల్లంగి గ్రామ ఉపసర్పంచ్ స్వర్ణరాజు, రైతులు స్వర్ణ వీర్రాజు, నిమ్మగడ్డ శ్రీను, కట్టిమేను నూకరాజు, అంకన శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి సమస్యపై వారు విలేకర్లతో మాట్లాడుతూ గొర్రిపూడి చానల్ నుంచి చొల్లంగిలోని సుమారు 250 ఎకరాల ఆయకట్టు భూములకు సాగు నీరు పూర్తిస్థాయిలో అందేదని, అయితే గత టీడీపీ ప్రభుత్వంలో కాసుల కక్కుర్తితో ఆదరాబాదరాగ కాలువకు ఇరువైపులా కాంక్రీటు నిర్మాణం చేయడంతో తమకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయన్నారు. సుమారు 9 అడుగుల మేర ఉన్న కాలువను నాలుగు అడుగులకు కుదించి కాంక్రీటు నిర్మాణాలు చేశారని, దీనివల్ల నీరు పూర్తిస్థాయిలో సరఫరా కాక తమ పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది రైతులు సాగునీటి సమస్య కారణంగా వ్యవసాయానికి దూరమై కూలి పనులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. చొల్లంగి ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 450 ఎకరాలకు సాగు నీరు అందేదని, అయితే రిటైనింగ్ వాల్స్ నిర్మించడం ద్వారా శివారు భూములకు నీరు రాకపోవడంతో వరిచేలు బీడు వారుతున్నాయని ఆరోపించారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కాంక్రీట్ నిర్మాణాలను తొలగించి పాత కాలువను పునరుద్ధరించి తమ కష్టాలను తొలగించాలని కోరుతున్నారు.

కళ్లు మూసుకుని ఆమోదిస్తామనుకున్నారా?

- ఆశీలు పాట టెండర్ల లోపాలపై సభ్యుల నిలదీత
- సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన అధికారులు
- వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: 'గెజిట్‌లో పేర్కొన్న నిబంధనలకు విరుద్ధంగా మార్కెట్ ఆశీలు వేలం పాట టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తూ, దాన్ని అజెండాలో పెట్టేస్తే కళ్లు మూసుకుని ఆమోదిస్తామనుకున్నారా' అంటూ పాలకపక్ష కౌన్సిలర్లు అధికారులపై ధ్వజమెత్తారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన బుధవారం ఉదయం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం ఆద్యంతం వాడివేడిగా సాగింది. పాలక పక్ష కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్‌లు ఆశీల పాట టెండర్లలో లోపాలపై కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్ల ప్రక్రియను అంశాల వారీగా ప్రశ్నించి నిబంధనలు పాటించని వైనంపై నిలదీశారు. గెజిట్‌లో దాదాపు 25 నిబంధనలు ఉన్నాయని, టెండరులో పాల్గొనే ప్రతి కాంట్రాక్టరు రూ.7 లక్షల వంతున డిపాజిట్ చేస్తూ డీడీ చూపించాలన్న నిబంధన అమలు కాకపోవడాన్ని ఎత్తి చూపారు. టెండర్లలో పాల్గొన్న ముగ్గురు కాంట్రాక్టర్లకు ఇద్దరు రూ.7 లక్షల వంతున డీడీలు ఎందుకు సమర్పించలేదన్న ప్రశ్నకు అధికారులు డొంక తిరుగుడు సమాధానాలు చెప్పారు. కొద్దిసేపు కాంట్రాక్టర్లు నగదు చెల్లించారని, అది మా వద్దే ఉందని చెప్పారు. దీనిపై కౌన్సిలర్లు మరింత లోతుగా ప్రశ్నల వర్షం కురిపించారు. డిపాజిట్ల కింద ఆ ఇద్దరు కాంట్రాక్టర్లు నగదు చెల్లిస్తే, అందుకు సంబంధించిన రశీదులు చూపించాలని పట్టుబట్టడంతో అధికారులు నీళ్లు నమిలారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ముందు ఆ ఇద్దరి కాంట్రాక్టర్ల నుంచి రూ.7 లక్షల డిపాజిట్ సేకరించాలని అధికారులకు సూచించారు. ఇలాంటి అంశాల్లో తప్పిదాలు జరిగితే సహించేది లేదని, ఇదే ఆఖరి హెచ్చరిక అని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పాలక పక్ష కౌన్సిలర్లు నాగారపు వెంకటేశ్వరరావు, దొమ్మేటి రాము, వాసర్ల లక్ష్మి, దొంగ నాగ సుధారాణి, బండారు గోవిందు, మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి



ఎన్నికల అధికారులతో సమావేశమైన లోక్‌సభ యానాం రీజియన్ వ్యయ పరిశీలకుడు హసన్

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా వచ్చే నెల 19వ తేదీన యానాంలో జరిగే ఎన్నికల పోలింగ్ ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అధికార యంత్రాంగం సహకరించాలని యానాం రీజియన్ వ్యయ పరిశీలకుడిగా పుదుచ్చేరి నుంచి విచ్చేసిన మంజరల్ హసన్ కోరారు. బుధవారం స్థానిక ఆర్‌ఏఓ ఆఫీసులో రిటర్నింగ్ అధికారి మునిస్వామి తదితర అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడ్ ఆఫ్ కాండాక్ట్ అమలులో ఉన్నందున నిబంధనలను అందరూ పాటించాలని సూచించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్-యానాం సరిహద్దుల్లో 10 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. అభ్యర్థులు చేసే ఖర్చును ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, అనుమానాస్పదంగా ఏవైనా ఉంటే వాటిని సీజ్ చేయాలన్నారు. సమావేశంలో ఎంసీఎంసీ బృంద సభ్యులు, వీడియో బృందం, ఎక్స్‌పెండేచర్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోళ్ల కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలపై సూచనలిస్తున్న తహసీల్దార్ సునీల్‌కుమార్

అల్లవరం: రైతులు పండించిన పంటను రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న గిట్టుబాటు ధరని పొందాలని తహసీల్దార్ సునీల్‌కుమార్ రైతులకు సూచించారు. వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై సొసైటీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, గ్రామ వ్యవసాయ సహాయకులకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొనుగోళ్ల కేంద్రాల్లో రైతులకు అందుబాటులో గోనె సంచులు ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఏఓ సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో 4,297 ఎకరాల్లో వరి సాగు జరిగిందని, 16 వేల టన్నుల ధాన్యం దిగుబడి సాధిస్తామన్నారు. 75 కేజీల బస్తాకు రూ.1,637 మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తామని, తేమ శాతం 17 శాతం లోపు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ పి.సూర్యనారాయణ, ఆర్‌ఐ దుర్గా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

22 మంది నామినేషన్ల దాఖలు

యానాం: పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానానికి ఆఖరి రోజైన బుధవారం నాటికి మొత్తం 22 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ కూటమి అభ్యర్థిగా హోంమంత్రి నమశ్శివాయం, ఎస్.వసంతి, కాంగ్రెస్ పార్టీ నుంచి సిటింగ్ ఎంపీ వైథిలింగం, పాండ్యన్, ఏఐఏడీఎంకే నుంచి తమిళవేందన్, నివేదిత, నామ్‌తమిళియార్ కచ్చి పార్టీ నుంచి ఆర్.మెనగా, ఎం.ప్రవీణ, సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా(కమ్యూనిస్టు) నుంచి పి.శంకరన్, ఇండిపెండెంట్లుగా మణికందన్, కె.కిషోర్‌కుమార్, ఎం.కృష్ణమూర్తి, కె.అరుణాచలం, నిర్మల, కొలన్ జ్యపన్, కె.రామదాసు, ఆర్.రాజా, ఇ.అనంతవేలు, ఎస్.సతీష్‌కుమార్, ఎస్.మాస్కో, కొట్టనే, ఎస్.కళ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 28న నామినేషన్ల పరిశీలన, 30న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది.

పోస్టు పెట్టే ముందు జర భద్రం

- ఎన్నికల నేపథ్యంలో సామాజిక మాధ్యమాలపైనా ఆంక్షలు
- ద్వేషపూరిత, అలజడులు రేపే పోస్టింగ్లు పెట్టే వారిపై కేసులు
- వివాదాస్పద పోస్టులను ఫార్వర్డ్ చేసినా బాధ్యులే

అంబాజీపేట: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సాగేలా ఎన్నికల కమిషన్ అన్ని చర్యలూ తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే సామాజిక మాధ్యమాలపైనా నిఘా వేసింది. ఎవరైనా ద్వేషపూరిత, అసత్య, సమాజంలో అలజడులు రేపే పోస్టింగ్‌లు పెడితే వెంటనే చర్యలు చేపట్టే ఏర్పాట్లు చేసింది.

అధికారులు నిరంతర పర్యవేక్షణ..

మారిన టెక్నాలజీకి అనుగుణంగా సామాజిక మాధ్యమాల (వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగామ్) ద్వారా కూడా రాజకీయ నాయకులు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కొన్ని అరాచక శక్తులు విద్వేషాలు రాజేసి తమ స్వార్థానికి వాడుకునే అవకాశం లేకపోలేదు. ఇలాంటి వారిని కట్టడి చేసేందుకు ఎన్నికల కమిషన్ నడుం బిగించింది. సోషల్ మీడియాపై అన్ని శాఖల అధికారులు ద్వారా నిఘా ఉంచింది. ఫొటో మార్ఫింగ్, అశ్లీల చిత్రాలు పంచుకోవడం, ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా సందేశాలు పంపడం, తదితర కార్యకలాపాలకు పాల్పడితే ఐటీ యాక్ట్-2000 సెక్షన్-67 కింద కేసు నమోదు చేస్తారు. నేరం రుజువైతే పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తారు. సోషల్ మీడియా గ్రూపు సభ్యులు అభ్యంతరకరమైన, వివాదాస్పద పోస్టులు, కామెంట్లు పెట్టినా వెంటనే వాటిని అడ్మిన్ డిలీట్ చేయాలి. లేదంటే పోస్టింగ్ చేసిన సభ్యుడితో పాటు గ్రూపు అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఫిర్యాదు చేస్తే కేసు..

సామాజిక మాధ్యమాల్లో ఎవరిపైనా వ్యక్తిగతంగా కానీ, పార్టీలపై కానీ, సంస్థలు, అధికార యంత్రాంగంపై కానీ అసత్య ప్రచారం చేయకూడదు. పోటీ చేసే అభ్యర్థులపై కార్టూన్స్, మీమ్స్, షార్ట్ వీడియోల ద్వారా అసత్య ప్రచారం చేసినట్లు ఎవరైనా ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే పోలీసులు, ఎన్నికల అధికారులు కేసులు నమోదు చేస్తారు. చట్ట విరుద్ధమైన ప్రకటనలు, రాజ్యాంగ ఉల్లంఘన, ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేసినా, ఐపీసీ-504, 505 సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు. సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచార ప్రకటనలకు ముందు జిల్లా, రాష్ట్ర స్థాయిలోని మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది.

పెయిడ్ న్యూస్ కింద పరిగణనలోకి..

ఇక.. ప్రస్తుత ఎన్నికల నిబంధన మేరకు పోలింగుకు 48 గంటల ముందే సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలి. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారం చేస్తే ఆయా పార్టీలు, అభ్యర్థులు వెచ్చిస్తున్న ఖర్చు వివరాల నివేదికను ఎన్నికల సంఘానికి అందజేయాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో ప్రచారం కూడా పెయిడ్ న్యూస్ కిందకే వస్తుంది. దీంతో ఈ ఖర్చు అభ్యర్థి ఎన్నికల ఖాతాలోకి వెళ్తుంది.

పీఆర్ డీఈఈ రాంబాబుకు సత్కారం



పీఆర్ డీఈఈ రాంబాబును సత్కరిస్తున్న వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇంజినీరింగ్‌లో ప్రతిభకు ఇటీవల తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గెడ్డం ప్రసాద్ చేతుల మీదుగా ఎక్సలెన్సీ అవార్డు అందుకున్న అమలాపురం పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబును స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని బంగారు, వెండి వర్తకుల సంఘ భవనంలో బుధవారం ఘనంగా సత్కరించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ అభినందన సభలో వాకర్స్ ప్రతినిధులు డాక్టర్ గంధం రామం, డాక్టర్ నిమ్మకాయల రామమూర్తి మాట్లాడుతూ రాంబాబు ఎక్సలెన్సీ అవార్డు తీసుకోవడం అమలాపురం వాకర్స్ క్లబ్‌కే గర్వ కారణమన్నారు. కార్యక్రమంలో వాకర్స్ జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, ఏరియా కోఆర్డినేటర్ తేతలి సత్యనారాయణరెడ్డి, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, క్లబ్ కార్యదర్శి కుడుపూడి త్రినాథ్, ఉపాధ్యక్షుడు రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్ తదతరులు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియ సంక్షేమానికి ప్రాధాన్యం



తాటిపాకలో గొల్లపల్లిని కలసి మద్దతు పలికిన అగ్నికుల క్షత్రియ సంఘ నాయకులు

రాజోలు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి బాటలు వేశారని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. బుధవారం మలికిపురం మండలం అడవిపాలెం సర్పంచ్ కొల్లు అనంతలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన అగ్నికుల క్షత్రియ సంఘ నాయకులు తాటిపాకలో గొల్లపల్లి సూర్యారావు స్వగృహం వద్ద ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని సంఘ నాయకులు గొల్లపల్లికి మద్దతు తెలిపారు. గొల్లపల్లి మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియులకు సామాజికంగా, ఆర్థికంగా తోడ్పాటు కల్పించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. పార్టీ నాయకులు కొల్లు నరసింహస్వామి, బొమ్మిడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో మేట్లకు శిక్షణ



పరిషత్ కార్యాలయంలో సదస్సులో పాల్గొన్న అధికారులు మల్లికార్జునరావు, కవిత

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని మేట్లకు వివిధ అంశాలపై అధికారులు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. మస్టరు నిర్వహణ, ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు, కొలతలు, 100 రోజుల పనిదినాలు కల్పించడం వాటిపై పి.గన్నవరం క్లస్టర్ ఏపీడీ జీవీకే మల్లికార్జునరావు, జాబ్ కార్డ్స్-బెనిఫిట్స్ ఏపీడీ జి.కవిత అవగాహన కల్పించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో ఎండీ నాగప్రసాద్, ప్లాంటేషన్ మేనేజర్ త్రినాథ్, జేఈ ఎస్.శ్రీను పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులది కీలకపాత్ర



ఉద్యోగవిరమణ చేసిన సత్తిబాబును సత్కరించిన ఉపాధ్యాయ బృందం

యానాం: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలకపాత్ర వహిస్తారని సర్వశిక్షా అభియాన్ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ ప్రాథమిక, హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పాలెపు సత్తిబాబు సత్కార సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా అంకితభావంతో సేవలందించడంతో పాటు ఉపాధ్యాయ సంఘ సెక్రటరీగా సైతం వివిధ సమస్యలపై ఆయన పోరాటం చేశారన్నారు. అనంతరం సత్తిబాబును దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శనైశ్చరుని హుండీల ఆదాయం రూ 2.97 లక్షలు

కొత్తపేట: మండలంలోని మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వారి ఆలయంలో హుండీల ద్వారా రూ.2,97,668 ఆదాయం వచ్చినట్టు దేవదాయ-ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి తెలిపారు. మూడు నెలల అనంతరం ఆలయ హుండీలను బుధవారం ఏసీ అండ్ ఈఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వెలిచేరు ఆలయ ఈఓ ఆకుల సత్యవర్ధన్ సమక్షంలో తెరచి లెక్కించారు. శనైశ్చరుని హుండీ ద్వారా రూ.2,80,257, అన్నదానం హుండీ ద్వారా రూ.17,411తో పాటు క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి వారి హుండీ ద్వారా రూ.15,661 ఆదాయం వచ్చిందని విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ ఉత్తమకుమారి, దేవస్థానం సిబ్బంది, అర్చకులు, సేవకులు, భక్తులు పాల్గొన్నారు.